క్లుప్తంగా

'పది' పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌ను నిరోధించాలి



భిక్కనూరు : పదో తరగతి పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌ను నిరోధించాలని కోరుతూ భిక్కనూరు ఎంఈవో రాజ్‌గంగారెడ్డికి టీజీవీపీ నేతలు గురువారం వినతిపత్రం అందజేశారు. పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో టీజీవీపీ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు గంధం సంజయ్, నియోజకవర్గ ఇన్‌చార్జి సమీర్‌ఖాన్, నాయకుడు యోగేష్,సాత్విక్‌లు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలని ప్రచారం



బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని అటానమస్ ప్రభుత్వం డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు తీసుకోవాలని గురువారం ఇంటర్ కళాశాల పరీక్షల కేంద్రాల వద్ద లెక్చరర్లు ప్రచారం చేశారు. ఇంటర్ పరీక్షలు రాసి విద్యార్థులు సెంటర్ల నుంచి బయటకు వస్తున్న వారిని డిగ్రీ కళాశాల లెక్చరర్లు కలిసి బిచ్కుంద డిగ్రీలో అడ్మిషన్లు తీసుకోవాలని కోరారు. కళాశాలలోని కోర్సులు ఉన్న సౌకర్యాలు, కళాశాలకు అటానమస్ గుర్తింపుతో ప్రయోజనాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు ఉపకార వేతనాలు, ఎన్ఎస్ఎస్ సేవలు ఉన్నాయని ఇంటర్ విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పోచారంలో చేపట్టిన ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. మండల పీహెచ్‌సీ వైద్యాధికారి సృజన్ ఆధ్వర్యంలో ఎంఎల్‌హెచ్‌పీలు అజయ్, దేవిదాస్, రాశి గ్రామస్తులకు వైద్యపరీక్షలు చేశారు. దీంతోపాటు గ్రామంలో విస్తారంగా పెరిగిన వయ్యారిభామ మొక్కలను ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తొలగించారు. వయ్యారిభామ మొక్కలతో కలిగే అనర్థాలను గ్రామస్తులకు వివరిస్తూ వారు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో మాల్తుమ్మెద సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ శ్రీరంజిత, డాక్టర్ రమ్య,, డాక్టర్ పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ యోజన అర్హుల జాబితా ఇవ్వాలని నిరసన



సదాశివనగర్(ఎల్లారెడ్డి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విశ్వకర్మయోజన కింద మండలంలో ఎంత మంది అర్హులు ఉన్నారో ఎంపికైన జాబితా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గురువారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట బీజేపీ నేతలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ మండలాధ్యక్షుడు రాంరెడ్డి మాట్లాడుతూ...మండలంలో ఏయే గ్రామంలో ఎంత మంది విశ్వకర్మ యోజన పథకం కింద దరఖాస్తులు చేసుకున్నారని ఎంత మందిని అర్హులుగా గుర్తించారని 90 రోజుల క్రితం సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు పెట్టినప్పటికి ఎందుకు వివరణ ఇవ్వడం లేదని ఎంపీడీవో సంతోష్‌కుమార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజుల్లో తెలుపుతామని చెప్పడంతో నిరసన కార్యక్రమాన్ని విరమించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మోహన్ రాజ్, వడ్ల రాజమౌళి, నల్ల సత్యం రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చరిత్రవిభాగం ఆధ్వర్యంలో వర్క్ షాప్

కామారెడ్డి అర్బన్: దేశంలో చరిత్రకెక్కని గిరిజన ఉద్యమాలు అనేకం జరిగాయని, గిరిజన ఆదివాసి జాతుల సంప్రదాయాలు, సంస్కృతిని కాపాడాలని కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ విజయ్‌కుమార్ అన్నారు. గురువారం కళాశాల చరిత్ర విభాగం ఆధ్వర్యంలో 'గిరిజన ఉద్యమాలు, చరిత్రకెక్కని గిరిజన వీరులు' అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. చరిత్ర విభాగం అధిపతి, వర్క్‌షాప్ కన్వీనర్ అంకం జయప్రకాష్ గిరిజన ఉద్యమాలను వివరించారు. రిసోర్స్ పర్సన్ టి.శ్రీనివాస్ గిరిజనుల నిర్వచనం, ఉద్యమాలు, చరిత్రకెక్కని వీరుల పోరాటాలను వివరించారు. కార్యక్రమంలో సమన్వయకర్తలు విశ్వప్రసాద్, సుధాకర్, శ్రీనివాస్‌రావు, దినకర్, రాములు, మానస, శ్రీవల్లి, కవిత, మీరాబాయి,రాజేందర్, సత్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని బాణాపూర్ తండా శివారులో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను గురువారం ఎంపీడీవో నరేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల హాజరు పట్టికలను తనిఖీ చేశారు.ఉపాధి పనులు కొలతల ప్రకారం నాణ్యతగా చేపట్టాలని సూచించారు.

కూరగాయల సాగు.. ఆదాయం బాగు

- ఆదర్శంగా నిలుస్తున్న మాచాపూర్ రైతులు
- సొంతంగా మార్కెట్లో విక్రయం



కూరగాయలను కోస్తున్న సుదర్శన్



దేవునిపల్లి శివారులో సాగవుతున్న పాలకూర పంటలు

ఎల్లారెడ్డి రూరల్ : వాణిజ్య పంటల వైపు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. కూరగాయల సాగుతో ఆదాయాన్ని ఆర్జిస్తూ.. తోటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. మండలంలోని మాచాపూర్ గ్రామానికి చెందిన నీలి సుదర్శన్ 30 ఏళ్లుగా కూరగాయల సాగు చేస్తున్నారు. తనకున్న మూడు ఎకరాల వ్యవసాయ భూమిలో వంకాయ, టమాటా, క్యాబేజీ, ఉల్లి, కూరగాయలతో పాటు ఆకుకూరలు పాలకూర,తోటకూర, మెంతి కూరల సాగుతో పాటు మొక్కజొన్న, వరి పంటలను సాగు చేస్తున్నారు. సీజన్లకు అనుగుణంగా కూరగాయలను సాగు చేస్తూ..ఏడాదికి రూ. లక్ష అదనపు ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నారు. కుటుంబ సభ్యులు కూడా సుదర్శన్‌కు తోడుగా వ్యవసాయ పనుల్లో చేదోడు వాదోడుగా నిలుస్తున్నారు. తండ్రికి బాసటగా కొడుకు ఉంటున్నాడు. దళారులను నమ్ముకుండా ఉదయం వేళలో ప్రతి రోజు మార్కెట్‌కు వెళ్లి స్వయంగా కూరగాయలను విక్రయిస్తున్నారు. దీంతో అధిక లాభాలు పొందుతున్నారు. కూలీల కొరత ఉండడంతో కుటుంబ సభ్యులతో కలిసి వ్యవసాయాన్ని చేస్తున్నారు. వ్యవసాయ అధికారుల సూచనల మేరకు మేలకువలు పాటించి అధిక దిగుబడులు పొందుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని దేవునిపల్లి గ్రామానికి చెందిన యువరైతు బాలకృష్ణ సైతం ఖరీఫ్‌లో వరి పంటలను సాగు చేస్తు, యాసంగిలో కూరగాయలను సాగు చేస్తు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఎకరం పంటపొలంలో యాసంగిలో పాలకూర, పుదీన, కొత్తిమీర, మెంతికూర, వంకాయలు సాగు చేస్తూ సీజన్‌లో రూ. 50 వేల వరకు ఆదాయం పొందుతున్నారు. ప్రభుత్వం రైతులకు బాసటగా నిలిస్తే మరింత అభివృద్ధి సాధించవచ్చని కోరుతున్నారు.

అందరం కలిసి పనిచేస్తాం



కూరగాయల సాగుతో లాభాలను పొందవచ్చు. కూరగాయల సాగులో కుటుంబంలో అందరం కలిసి పని చేయడంతో లాభాలు వస్తున్నాయి. కూలీలు దొరకడంలేదు. కుటుంబసభ్యులతో కలిసి పని చేయడం ఆనందంగా ఉంది.

–నీలి సుదర్శన్, రైతు, మాచాపూర్

యాసంగిలో మాత్రమే సాగు..



ఖరీఫ్‌లో ఎకరం పొలంలో వరి పంటలను సాగు చేస్తా. యాసంగిలో ఎకరం పొలంలో పుదీన, కొత్తిమీర, వంకాయలు, పాలకూర పంటలను సాగు చేస్తా. యాసంగిలో వరి పంటకు నీరు సరి పోక పోవడంతో కూరగాయల సాగు ద్వారా ఆదాయాన్ని పొందుతున్నా.

– బాలకృష్ణ, యువరైతు, దేవునిపల్లి

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



ఎల్లారెడ్డి మోడల్‌స్కూల్‌లో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న ఉపాధ్యాయులు



గోపాల్‌పేట పరీక్షాకేంద్రంలో..

నిజాంసాగర్/ఎల్లారెడ్డిరూరల్/నాగిరెడ్డిపేట/తాడ్వాయి/రాజంపేట/బీబీపేట/లింగంపేట/భిక్కనూరు : జిల్లాలో శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు విద్యాశాఖాధికారులు తెలిపారు. నిజాంసాగర్‌లో రెండు పరీక్ష కేంద్రాలను ఎంఈవో తిరుపతి రెడ్డి తెలిపారు. ఎల్లారెడ్డిలో మోడల్ స్కూల్, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, సాంఘీక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలల్లో పదోతరగతి పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంఈవో వెంకటేశం తెలిపారు. గోపాల్‌పేట హైస్కూల్ పరీక్షాకేంద్రంలో 211మంది విద్యార్థులు, మోడల్‌స్కూల్ పరీక్షాకేంద్రంలో 169మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు నాగిరెడ్డిపేట ఎంఈవో భాస్కర్‌రెడ్డి తెలిపారు. తాడ్వాయి ఉన్నతపాఠశాలలో 161 మంది విద్యార్థులు, బాలికల గురుకుల పాఠశాలలో 150, కన్‌కల్ ఉన్నతపాఠశాలలో 136 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని ఎంఈవో రామస్వామి తెలిపారు. రాజంపేట బాలికల ఉన్నత పాఠశాల, కొండాపూర్ లోని ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని ఎంఈవో పూర్ణ చందర్ రావ్ తెలిపారు. భిక్కనూరు బాలుర, బాలికల, జంగంపల్లి ఉన్నత పాఠశాల, పెద్దమల్లారెడ్డి బాలికల ఉన్నత పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంఈవో రాజ్‌గంగారెడ్డి తెలిపారు. లింగంపేట బాలుర ఉన్నత పాఠశాలలో 270 మంది, మైనారిటీ గురుకుల పాఠశాలలో 220 మంది పరీక్షలకు హాజరుకానున్నట్లు ఎంఈవో శౌకత్‌అలీ తెలిపారు. బీబీపేట బాలుర ఉన్నత పాఠశాలలో ఏ, బీ సెంటర్లుగా, మాందాపూర్ ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవో అశోక్ తెలిపారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నందున జిరాక్స్, ఆన్‌లైన్ సెంటర్లను మూసి ఉంచాలని అధికారులు సూచించారు. విద్యార్థులు పరీక్షల సమయానికి ముందే కేంద్రాలను చేరుకోవాలని సూచించారు.



బీబీపేట బాలుర ఉన్నత పాఠశాలలో..



లింగంపేటలో పరిశీలిస్తున్న ఎంఈవో శౌకత్‌అలీ

పేద ఓసీలకు 'రాజీవ్ యువవికాసం' వర్తింపజేయాలి



వినతిపత్రం అందజేస్తున్న రెడ్డి ఐక్యవేదిక ప్రతినిధులు

కామారెడ్డి క్రైం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువవికాసం పథకాన్ని ఓసీ కులాల్లోని పేద యువతను చేర్చాలని రెడ్డి ఐక్యవేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం రెవెన్యూ అదనపు కలెక్టర్ వి.విక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐక్య వేదిక ప్రతినిధులు మాట్లాడుతూ కులాలకు అతీతంగా ఆర్థికంగా వెనుకబడిన వారందరికీ ఈపథకాన్ని వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో రెడ్డి ఐక్యవేదిక రాష్ట్ర కోర్ కమిటీ చైర్మన్ నాగర్తి చంద్రారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లవెల్లి కరుణాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు మోహన్ రెడ్డి, రాష్ట్ర ప్రతినిధులు ఏనుగు రాజిరెడ్డి, జిల్లా ప్రతినిధులు ఏడీ నర్సారెడ్డి, మోహన్ రెడ్డి, రవీందర్ రెడ్డి, సతీష్ రెడ్డి, బుచ్చిరెడ్డి, మల్లారెడ్డి, ఆయా మండలాల రెడ్డి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కదిలిన అధికారులు

–ప్రమాదకర బావుల పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..



ప్రమాదకర బావులను పరిశీలిస్తున్న అధికారులు

మాచారెడ్డి : రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న బావులపై 'సాక్షి'లో గురువారం ప్రచురితమైన 'ఈ బావులు ప్రమాదాలకు నిలయాలు' అనే కథనానికి పోలీసు, అధికారులు స్పందించారు. మాచారెడ్డి ఎస్సై అనిల్ మండలంలోని మైసమ్మ చెరువు తండా నుంచి సోమారంపేటకు వెళ్లే రహదారిపై రోడ్డు పక్కన ఉన్న బావులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బావులకు అడ్డుగా రెయిలింగ్‌ను ఏర్పాటు చేయిస్తామని తెలిపారు.



వెల్లుట్లలో పనులు ప్రారంభిస్తున్న నాయకులు




మహమ్మద్ నగర్‌లో ..

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఎల్లారెడ్డి/నిజాంసాగర్/లింగంపేట : ఎల్లారెడ్డి మండలం వెల్లుట్ల గ్రామంలో కాంగ్రెస్ నాయకులు గురువారం సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. గ్రామంలో రూ. 5లక్షల నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు వారు కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. మహమ్మద్ నగర్‌లోని రూ. 15 లక్షల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణ పనులను గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోట రాజు ప్రారంభించారు. లింగంపేట మండలం ముంబోజిపేట తండాలో సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు న్నారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల సంబురాలు



గోలిలింగాలలో పాలాభిషేకం చేస్తున్న నాయకులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : అసెంబ్లీ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు ఆమోదం తెలుపుతూ ఏకగ్రీవ తీర్మానం చేయడంతో మండలంలోని గోలిలింగాలలో గురువారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు తొంట సాయిలు ఆధ్వర్యంలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు తొంట సాయిలు, నాయకులు బాబు, సందీప్, ప్రవీణ్, లింగం తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



తాడ్వాయిలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



భిక్కనూరులో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో..



దోమకొండలో..

తాడ్వాయి/దోమకొండ/భిక్కనూరు/ కామారెడ్డి టౌన్ : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు సంబంధించి బిల్లును శాసన సభ ఆమోదం తెలపడంతో దోమకొండ మండల బీసీ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా బీసీ సంఘం ఆధ్వర్యంలో దోమకొండలో, తాడ్వాయి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద గురువారం సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అలాగే రాజీవ్ యువ వికాసం పథకం కింద నిరుద్యోగ బీసీ ఎస్సీ, ఎస్టీ మైనారిటీ యువతకు స్వయం ఉపాధి పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినందుకు భిక్కనూరులో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంబురాలు జరుపుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. అలాగే మాదిగ రాజకీయ పోరాట సమితి, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం అంబేడ్కర్ విగ్రహం ముందు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, సీఎం రేవంత్ రెడ్డి, మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈకార్యక్రమంలో మాదిగ రాజకీయ పోరాట సమితి జిల్లా అధ్యక్షులు చిట్యాల సాయన్న, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్ భాగయ్య, కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, దోమకొండ మాజీ జెడ్పీటీసీ తిర్మల్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా బాధ్యతల స్వీకరణ



వేణుగోపాల్

బిచ్కుంద(జుక్కల్) : మండల తహసీల్దార్‌గా వేణుగోపాల్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఉన్న తహసీల్దార్ సురేష్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో పిట్లం నుంచి బదిలీపై బిచ్కుందకు తహసీల్దార్‌గా వేణుగోపాల్ వచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తహసీల్దార్ పేర్కొన్నారు. అనుమతి లేకుండా ఇసుక, మొరం తరలించొద్దని సూచించారు.

లింగంపేటలో ..



రాందాస్

లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట మండల నాయబ్ తహసీల్దార్‌గా రాందాస్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు పనిచేసిన నాయబ్ తహసీల్దార్ సంగమేశ్వర్ బాన్సువాడకు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో ఎల్లారెడ్డి ఆర్డీవో కార్యాలయం నుంచి వచ్చిన రాందాస్ విధుల్లో చేరారు.

నేడు అడివిలింగాలలో బోనాల పండగ

ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని అడివిలింగాల గ్రామంలో శుక్రవారం బోనాల పండగ నిర్వహించనున్నట్లు గ్రామస్తులు గురువారం తెలిపారు. గ్రామంలోని నల్లపోచమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం బోనాలు సమర్పించనున్నట్లు వారు తెలిపారు. భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

'బడ్జెట్‌లో ఆరు గ్యారంటీలకు నిధులేవి'



బాన్సువాడలో మాట్లాడుతున్న నాయకులు

బాన్సువాడ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆరు గ్యారంటీల అమలుకు నిధులేవని బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నించారు. గురువారం బాన్సువాడలో బీఆర్ఎస్ నాయకులు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్ మాట్లాడుతూ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆరు గ్యారంటీల ఊసే లేదని, బడుగు బలహీన వర్గాలను మోసం చేసేలా బడ్జెట్‌ను రూపొందించారన్నారు. చాలా మంది రైతులకు రైతు భరోసా నిధులు రాలేదని, స్థానిక ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఈ విషయాలపై ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. పంటలు చేతికొచ్చే సమయంలో నీరందక ఎండిపోతుంటే స్థానిక కాంగ్రెస్ నాయకులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు ఎర్రవాటి సాయిబాబా, మోచీ గణేష్, రమేష్‌యాదవ్, అఫ్రోజ్, మేకల రాములు, సాయిలు, గంపల శంకర్, రమేష్ గౌడ్, మొగులయ్య, బాలయ్య, అంజయ్య, విఠల్ తదితరులున్నారు.



మద్నూర్‌లో విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం



నస్రుల్లాబాద్‌లో ..

అథ్లెటిక్స్‌లో విద్యార్థుల ప్రతిభ

మద్నూర్(జుక్కల్)/నస్రుల్లాబాద్ : మండలంలోని బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చూపారని ప్రిన్సిపల్ నందాల గంగాకిషోర్, పీఈటీ జాదవ్ గణేశ్ తెలిపారు. గురువారం వారు మాట్లాడుతు అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ స్టేట్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలను కామారెడ్డిలో నిర్వహించారు. ఇందులో 400 మీటర్ల పరుగుపందెంలో గురుకుల జూనియర్ కళాశాలకు చెందిన జగదీష్(ప్రథమ), జవహర్‌సింగ్(ద్వితీయ), విష్ణు(తృతీయ), 100 మీటర్ల పరుగుపందెంలో గణేష్(ప్రథమ), బాలకృష్ణ(ద్వితీయ) బహుమతులు సాధించారన్నారు. జావిలింగ్ త్రో పోటీలో విష్ణు(ద్వితీయ), రామకృష్ణ(తృతీయ)లు ప్రతిభ చూపారన్నారు. రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జగదీష్, గణేష్ ఎంపికయ్యారని చెప్పారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన వారికి ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు అభినందలు తెలియజేశారు. అలాగే నస్రుల్లాబాద్ గిరిజన గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చూపారని ప్రిన్సిపల్ మాధవ రావు తెలిపారు.

సంక్షిప్తం

భోగ్ బండార్‌ను విజయవంతం చేయాలి

పిట్లం(జుక్కల్): ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ఆదేశాల మేరకు పిట్లంలో ఈనెల 23న ఆదివారం భోగ్ బండార్ కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తున్నట్లు బంజార సంఘం నాయకులు పేర్కొన్నారు. ఈమేరకు వారు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో మాట్లాడారు. కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు బానోత్ లోక్యానాయక్, రామావత్ గోపి సింగ్, రాష్ట్ర బంజారా వర్కింగ్ ప్రెసిడెంట్ బాబు సింగ్, రవి నాయక్, కాశీరాం, లక్ష్మణ్, రామ్ జీ నాయక్, ఎస్టీ సెల్ యూత్ వైస్ ప్రెసిడెంట్ సురేష్, రాము రాథోడ్, పట్లొథ్ రాంసింగ్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక వైద్య శిబిరం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం జిల్లా మానసిక వైద్య నిపుణులు రమణ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాలకు చెందిన మానసిక రోగులకు వైద్య పరీక్షలు చేశారు. జిల్లా సోషల్ వర్కల్ రాహుల్, సీహెచ్‌వో నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి వీడీసీ నూతన కార్యవర్గం ఏర్పాటు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో గురువారం గ్రామాభివృద్ధి కమిటీని సభ్యులను ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా మేకల రాజు, ఉపాధ్యక్షులుగా కృష్ణమూర్తి, దమ్మన్నగారి రాములు, లాలమ్మల నరేష్, కోశాధికారిగా ఎరవటిరాజు, ప్రధాన కార్యదర్శిగా కీసరి రంజిత్ కుమార్, కార్యదర్శిగా దాస సత్యం, సలహాదారులుగా మెట్టుబాలురాజు, గాండ్ల సంజీవులు, గైనిరాజయ్య, ముదాం యాదగిరి, అజ్మత్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కార్యవర్గ సభ్యులకు గ్రామస్తులు సన్మానం చేశారు.

ఇంటి పన్ను వసూలు వేగవంతం చేయాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని 41 గ్రామ పంచాయితీల్లో ఇంటి పన్నుల వసూలు వేగవంతం చేయాలని ఎంపీవో మల్హారి సూచించారు. గురువారం ఆయన మండలంలోని బాయంపల్లి, బాణాపూర్, కొర్పోల్, ఎల్లారం, గ్రామాల్లోని గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. ఎల్లారం గ్రామంలో నిర్మాణం చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఆయన వెంట కార్యదర్శులు ఉన్నారు.

అవార్డు టీచర్స్ అసోసియేషన్ డైరీల పంపిణీ

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవార్డు టీచర్స్ అసోసియేషన్(ఏటీఏ) 2025 డైరీలను గురువారం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, అవార్డు టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రతినిధి గంగాకిషన్ అవార్డు పొందిన టీచర్లకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఉత్తమ సేవలు అందించి అవార్డు పొందిన ఉపాధ్యాయులను అభినందించారు. విద్యార్థుల శ్రేయస్సుకోసం నిరంతరం పని చేయాలని సూచించారు.

23న మోడల్ ఎంసెట్ పరీక్ష

కామారెడ్డి టౌన్ : టీఎస్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 23న ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని వీఆర్‌కే జూనియర్ కళాశాలలో మోడల్ ఎంసెట్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ఇంటర్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 9492874006, 94408 62825, 9133676076 నంబర్‌లను సంప్రదించాలని తెలిపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కామారెడ్డి & ఎల్లారెడ్డి
96034 62494
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
బాన్సువాడ: యం. మధుసూధన్ : 9951027699
ఎల్లారెడ్డి: ఎం. శ్రీనివాస్ : 9704490298
కామారెడ్డి : కె. రాజు : 9949699861
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899